7


సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 1 । ఆగస్టు । 2023



'ఎర్రకోనేరు' నిందితుల అరెస్టు

ఎర్రకోనేరు హత్యోదంతంలో నిందితులు సునీల్ సాహు, రాజ్ బిందా సింగ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. తొమ్మిది రోజుల్లోనే ఈ కేసు మిస్టరీని ఛేదించారు. - 8లో▸



డెల్టాలకు 11,300 క్యూసెక్కులు

ధవళేశ్వరం: డెల్టాలకు సోమవారం 11,300 క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల చేశారు. తూర్పు 4,300, సెంట్రల్ 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కులు వదిలారు.

పట్టాలెక్కనున్న ప్రగతి



అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తుని, కాకినాడ, నిడదవోలు స్టేషన్లు ఎంపికయ్యాయి. వీటిల్లో అదనపు ప్లాట్‌ఫాంలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు వంటి ఆధునిక సౌకర్యాలు సమకూరనున్నాయి. - 8లో▸

న్యూస్‌రీల్

వరద తగ్గుముఖం పట్టింది



వరద బాధితులకు భోజనాలు వడ్డిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్ తదితరులు

అల్లవరం: ఎగువ ప్రాంతాల్లో వరద తీవ్రత తగ్గిందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బోడసకుర్రులోని వరద ప్రభావిత ప్రాంతాన్ని ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలసి సోమవారం పరిశీలించారు. వరద బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వరద బాధితులకు స్వయంగా భోజనాలు వడ్డించి వారితో మాట్లాడారు. భద్రాచలం వద్ద వరద తీవ్రత తగ్గిందని, మంగళవారం సాయంత్రానికి సాధారణ స్థాయికి వస్తుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 40 గ్రామాలు వరద తాకిడిని ఎదుర్కోగా, సుమారు 4 వేల కుటుంబాలు వరద ప్రభావానికి గురయ్యాయని తెలిపారు. 36 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి వరద బాధితులకు భోజనాలు, తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు, పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. వలంటీర్లు చేస్తున్న సేవలను కలెక్టర్ హిమాన్షు శుక్లా అభినందించారు. అనంతరం వరద బాధితులతో కలసి భోజనం చేశారు. ఆయన వెంట ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, సీఐ వీరబాబు, కొనుకు మహేష్ పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలను అభివృద్ధి చేయాలి

డీఈవో కమలకుమారి



మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

అమలాపురం టౌన్: ఉర్దూ పాఠశాలలను ఆ భాషాపరంగా మరింత అభివృద్ధి చేయాలని, అందుకు తరుచూ నిర్వహించే ఉర్దూ స్కూలు కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ఎం.కమలకుమారి సూచించారు. స్థానిక మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఉర్దూ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగిన ఉభయ గోదావరి జిల్లాల ఉర్దూ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి డీఈవో కమలకుమారి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉర్దూ పాఠశాల అసిస్టెంట్ ఏఎంవో ఎస్‌కే మొహిద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన దాదాపు 40 ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరై ఆ భాషను అభ్యసించే విద్యార్థుల ప్రగతికి అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. ఉర్దూ పాఠశాలల్లో అమలవుతున్న స్మార్ట్ టీవీ, డిజిటల్ విద్యాబోధనపై డీఈవో కమలకుమారి విద్యార్థులతో మాట్లాడారు. జిల్లా విద్యా శాఖ సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఖ్వాజా మొహిద్దీన్, రిసోర్స్ పర్సన్ ఎస్‌కే సుభాని, సయ్యద్ రుహి పాల్గొన్నారు.

పెట్రోలు బంకులపై విజిలెన్స్ దాడులు



రాజమహేంద్రవరం ప్రాంతంలోని బంక్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు పెట్రోలు బంకులపై రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు, కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామేశంపేట, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలోని బంకుల్లో మూడు బృందాలుగా ఈ దాడులు చేశారు. లోపాలు గుర్తించిన బంక్‌ల నుంచి శాంపిల్స్ సేకరించి, వాటిని నాణ్యత తనిఖీల నిమిత్తం వైజాగ్ ల్యాబ్‌కు పంపించారు. విజిలెన్స్ ఎస్పీ కె.కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, సివిల్ సప్లయ్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ అధికారులు ఈ తనిఖీలు చేశారు. విజిలెన్స్ డీఎస్పీ పి.ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్లు సత్య కిషోర్, రమేష్, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ్ మహేష్, తహసీల్దార్ విజయకుమార్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో పడవపై ప్రయాణిస్తున్న గ్రామస్తులు

నెమ్మదించిన గోదారమ్మ

- తగ్గుతున్న వరద తాకిడి
- లంకలలో ఇంకా ముంపు
- ముమ్మరంగా సహాయక చర్యలు

సాక్షి అమలాపురం: ఉగ్ర గోదావరి శాంతిస్తోంది. గడిచిన ఐదారు రోజులుగా లంక గ్రామవాసులను కంటి మీద కునుకు లేకుండా చేసిన గోదావరి వరద నెమ్మది నెమ్మదిగా తగ్గుతోంది. ఎగువన వరద తగ్గుతుండగా లంక గ్రామాల్లో మాత్రం ముంపు కొనసాగుతోంది. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టింది.

గోదావరి ఎగువ ప్రాంతాల్లో **సోమవారం వరద** తగ్గుతోంది. భద్రాచలం వద్ద వే**గంగా, ధవళేశ్వరం** సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద **వరద నెమ్మది నెమ్మ**దిగా తగ్గుముఖం పడుతోంది. **భద్రాచలం వద్ద** ఉదయం ఐదు గంటలకు 46.80 **అడుగుల ఎత్తున** ప్రవహించిన గోదావరి రాత్రి 9 గంటలకు 38.40 అడుగులకు పడిపోయింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉదయం ఐదు గంటలకు 16.02 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు విడుదల చేయగా, రాత్రి 9 గంటలకి ఇది 13.69 లక్షల క్యూసెక్కులకు తగ్గింది.

175 పడవలపై రాకపోకలు

- గోదావరి వరద ఉధృతి ప్రారంభమైనప్పటి **నుంచి బాధితులకు సహాయ సహకారాలు అందించడంలో జిల్లా యంత్రాంగం అహర్నిశలూ పని చేస్తోంది. ఏటిగట్ల పరిరక్షణపై దృష్టి సారించడంతో పాటు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల వద్ద రక్షణ చర్యలు చేపట్టారు.**
- గోదావరి మధ్యనున్న లంక గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు, పాడి రైతులకు చెందిన పశువులను తరలించేందుకు 175 పడవలను ఏర్పాటు చేశారు. ఈ పడవల మీదనే వందలాది మంది స్థానికులు, విద్యార్థులు, రైతులు, పాడి రైతులు రాకపోకలు సాగిస్తున్నారు.
- గోదావరి వరద వల్ల జిల్లాలోని పది మండ**లాల్లో 30 గ్రామాలపై వరద ప్రభావం చూపుతోంది. 3,046 కుటుంబాలకు చెందిన 10,140 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.**
- **గత ఏడాది స్థాయిలో వరద వచ్చినట్టయితే ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఆశ్రయం** కల్పించేందుకు 71 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే మూడో ప్రమాద హెచ్చరిక వరకు వచ్చి ఆగిపోవడంతో 32 పునరావాస కేంద్రాలను తెరచి బాధితులకు అండగా నిలబడ్డారు. ఆదివారం కన్నా సోమవారం కొత్తగా మరిన్ని పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- **ఇప్పటివరకు 51**,432 మందికి భోజనాలు, **భోజనం ప్యాకెట్లు** అందించడంతోపాటు 1.60 **లక్షల వాటర్ ప్యాకెట్ల** మంచినీరు, 11,200 లీటర్ల **వాటర్ క్యాన్లు అందజే**శారు. ముంపు ప్రభావిత **ప్రాంతాలకు పడవల**పై వెళ్లి భోజనం ప్యాకెట్లు, **వాటర్ క్యాన్లు అందజే**యడం ద్వారా బాధితులకు **ఇబ్బంది లేకుండా చేశా**రు.
- **లంక వాసుల ర**క్షణ కోసం 174 మందితో **కూడిన ఒక ఎన్‌డీఆర్**ఎఫ్, నాలుగు ఎస్‌డీఆర్‌ఎఫ్ **బృందాలను, 20 మం**ది గజ ఈత బృందాలను **మోహరించారు.**
- **లంక గ్రామాల్లో** 78 వైద్య బృందాలను **ఏర్పాటు చేసి చికిత్స** అందజేస్తున్నారు.
- **వరదకు ముందే** పశువుల కోసం ఎండు గడ్డి **స్టాక్ పాయింట్లు పెట్ట**డం వల్ల పాడి రైతులకు గడ్డి కొరత రాకుండా చూశారు. 125 లంక గ్రామాల్లో 24,673 పశువులకు దాణా అందజేశారు. 134 మెట్రిక్ టన్నుల ఎండుగడ్డి, 200 మెట్రిక్ టన్నుల సమీకృత దాణాను సిద్ధం చేశారు.
- ముంపు బారిన పడిన బి దొడ్డవరం, అప్పనపల్లి తదితర గ్రామాల్లో రైతుబజార్లు ఏర్పాటు చేశారు.

దెబ్బతిన్న ఉద్యాన పంటలు

గోదావరి వరదలకు తోడు మురుగునీటి కాలువలు పోటెత్తి ప్రవహించడంతో ఇప్పటి వరకు 1,141 హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, వీటి విలువ రూ. 2.19 కోట్లు ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు. కోనసీమ జిల్లా లంక గ్రామాలలో వరద ముంపు తగ్గలేదు. ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట తదితర మండలాల్లో లంకల వద్ద సాయంత్రం నుంచి వరద తగ్గుతుండగా, పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవ**రం, కాట్రేనికోన రాజోలు, మలికిపురం, సఖినేటిప**ల్లి లంక గ్రామాల్లో వరద ఉధృతి తగ్గలేదు. మంగళవారం ఉదయం నుంచి ఇక్కడ వరద తగ్గాల్సి ఉన్నప్పటికీ పౌర్ణమి కారణంగా ముంపు తగ్గేందుకు సమయం పడుతుందని స్థానికులు చెబుతున్నారు. ముమ్మిడివరం మండలం గురజాపులంక, కునాలంక, లంకాఫ్ ఠాన్నేలంక మత్స్యకార కాలనీ, ఐ.పోలవరం మండలం కేశనకుర్రు, కాట్రేనికోన మండలం నడవపల్లి, పల్లంకుర్రు ఏటిగట్టు దిగువ ఉన్న కాలనీలలో ఇళ్లు ముంపులోనే ఉన్నాయి. పి.గన్నవరం మండలం శివాయలంక, నాగులంక, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల పరిధిలోని అప్పన రామునిలంక, టేకిశెట్టిపాలెంలో **ఇళ్లు ముంపులో నాను**తున్నాయి.



అయినవిల్లి మండలం కొండుకుదురులంకలో పడవపై పర్యటిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి పి.దుర్గారావుదొర



అప్పనపల్లిలో వరద నీటిలో బాధితులకు ప్రత్యేక వైద్య సేవలు



పి.గన్నవరం మండలం మానేపల్లి శివారు శివాయలంకలో వరద బాధితులకు ఆహారం అందిస్తున్న సహాయక సిబ్బంది



బోడసకుర్రు మత్స్యకార కాలనీలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కారం

స్పందనపై కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచన

అమలాపురం రూరల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత కాల వ్యవధిలో అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన హాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో 191 అర్జీలను కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జీవి సత్యవాణి ,పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎస్.సుధాసాగర్ స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులకు తమ లాగిన్ ద్వారా అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి, నివేదికలను ఫొటోలతో సహా యాప్‌లో అప్లోడ్ చేస్తూ సకాలంలో అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కార మార్గాలు చూపాలన్నారు. అర్హత ఉండి సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు, సేవలు పొందని వారిని గుర్తించి, వారి సమస్యల పరిష్కరించేందు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సీపీఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎ.బోసు బాబు, ఆర్డీవో అశోక్ ప్రతాప్‌రావు, ఎల్‌డీఎం ప్రసాద్, జిల్లా హౌసింగ్ అధికారి సీహెచ్ బాబు రావు, డీఈఓ ఎం.కమల కుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పంచాయతీరాజ్ రహదారులశాఖ ఎస్ఈలు కె.చంటిబాబు, బి.రాము వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

తమ న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అగ్రిగోల్డ్ బాధితులు కలెక్టర్ శుక్లా వినతిప్రతం అందించారు. ఎస్.యానాంలో అక్రమ రొయ్యల చెరువులను తొలగించి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని కొందరు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. బోడసకుర్రులో నిర్మించిన టిడ్కో గృహాల కేటాయింపులో అక్రమాలు జరిగాయని జనసేన కౌన్సిలర్లు ఏడిద శ్రీను, పిండి అమరావతి ఫిర్యాదు చేశారు.

పోలీసు 'జగనన్నకు చెబుదాం'కు 24 ఫిర్యాదులు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 24 ఫిర్యాదులు అందాయి. తొమ్మిది మంది మహిళలు, 15 మంది పురుషులు ఫిర్యాదులు చేశారు. ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వచ్చిన ఫిర్యాదులపై నిర్ణీత సమయంలో నివేదిక ఇవ్వాలని ఎస్పీ శ్రీధర్ జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్ల అధికారులను ఆదేశించారు. 24 ఫిర్యాదుల్లో 9 సివిల్ వివాదాలు, 3 కుటుంబ కలహాలు, 12 ఇతర సమస్యలు ఉన్నాయి. అమలాపురం పోలీసు సబ్ డివిజన్ నుంచి 13, రామచంద్రపురం డివిజన్ నుంచి 4, కొత్తపేట డివిజన్ నుంచి 7 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ శ్రీధర్ నేరుగా ఫిర్యాదు పత్రాలు తీసుకుని వాటి పరిష్కారానికి వారితో మాట్లాడారు. ఎస్పీ కార్యాలయ స్పెషల్ బ్రాంచి సీఐ కోలా రజనీకుమార్, డీసీఆర్‌బీ ఎస్సై గంగాభవాని పాల్గొన్నారు.



ఎస్పీ శ్రీధర్‌కు సమస్యను వివరిస్తున్న ఫిర్యాదుదారులు

నేరస్తుడిని కనిపెట్టు...రూ.5 వేలు పట్టు!

సీసీ పుటేజీలో దొరికిన బైక్ దొంగ కోసం పోలీసు నజరానా



దొంగిలించిన బైక్‌తో వెళుతున్న వ్యక్తి

అమలాపురం టౌన్: మోటారు సైకిల్ దొంగ ఆచూకీ తెలపండి.. రూ.5 వేలు బహుమతి పొందండి అంటూ అమలాపురం పట్టణ పోలీసులు నజరానా ప్రకటించారు. చోరీకి గురైంది ఒక్క మోటారు సైకిలే అయినప్పటికీ ఆ చోరీ దృశ్యాలు, బైక్‌ను దొంగిలించిన వ్యక్తి కదలికలు సీసీ పుటేజీల్లో రికార్డు అవడంతో అతని ఆచూకీ తెలుసుకుంటే మిగతా చోరీల విచారణకు వీలవుతుందని పోలీసులు ఈ నజరానాను ప్రకటించారు. ఈ చోరీకి సంబంధించిన వివరాలను డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులోని ఒక బార్ వద్ద పార్కు చేసిన మోటార్ సైకిల్ ఆదివారం మధ్యాహ్నం 2.15 ప్రాంతంలో చోరీకి గురైంది. బైక్‌ను దొంగిలిస్తున్న సీసీ పుటేజీ దృశ్యాలు, చోరీకి పాల్పడిన వ్యక్తి ఫొటో, వీడియోలను పోలీసులు విడుదల చేశారు. సమాచారం ఇచ్చిన వారికి రూ.5 వేలు బహుమతి ప్రకటించి ఈ విషయాన్ని విస్తృత ప్రచారం చేశారు. సమాచారం అందించినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, బైక్ దొంగిలించిన వ్యక్తి సమాచారం తెలిస్తే పట్టణ సీఐ డి.దుర్గాప్రసాద్-9440796561, పట్టణ ఎస్సై జి.హరీష్‌కుమార్-9949965056 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని డీఎస్పీ అంబికాప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్‌కు జట్ల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడా మైదానంలో కాకినాడ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యాన అండర్-12, 13 విభాగాల్లో సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు సోమవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రాపేటి సంతోష్ కుమార్ ఈ పోటీలను ప్రారంభించారు. బాలుర విభాగంలో 70 మంది, బాలికల విభాగంలో 30 మంది హాజరయ్యారని కార్యదర్శి రాజేష్ తెలిపారు. వీరి నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశామని చెప్పారు. కార్యక్రమంలో కోచ్ కోరుమిల్లి స్వామి శ్రీనివాస్, పీఈటీ, పీడీలు, రిఫరీలు పాల్గొన్నారు.

అమ్మ స్తన్యం.. అమృత తుల్యం



- పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలి
- నేటి నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు

రాయవరం: పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లి పాలు కీలకం. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలను మించిన ఔషధం లేదు. బిడ్డకు తల్లి పాలు ప్రకృతి అందించిన వరం. దీనికి మరేది సాటిరాదు. తల్లుల్లో ఉన్న అపోహలతో కొందరు మాతృమూర్తులు వారి బిడ్డలకు శ్రేష్టమైన తల్లిపాలను దూరం చేస్తున్నారనే విమర్శలున్నాయి. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ తదితర అంతర్జాతీయ సంస్థలతో పాటు, జాతీయ సంస్థలు తల్లిపాల ప్రాధాన్యతను తెలియజెప్పేందుకు ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాయి. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్యశాఖలు సంయుక్తంగా పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

రోగ నిరోధక శక్తికి..

ముర్రుపాలలో పసుపుపచ్చని కొలస్ట్రం(కొలెస్ట్రాల్) అనే పదార్థం ఉంటుంది. గుండె రక్తప్రసరణ వ్యవస్థ, నాడీ వ్యవస్థ పనితీరును అభివృద్ధి పరుస్తుంది. శిశువులో రోగనిరోధక శక్తి పెంచి ఎదుగుదలకు దోహదం చేస్తుంది. ఖనిజాలు, మాంసకృతులు, విటమిన్లు, తల్లిపాలలో సమృద్ధిగా ఉంటాయి. బిడ్డ పేగుల నుంచి విసర్జకాలను తొలగించడానికి, అలర్జీలు నిరోధించేందుకు తల్లిపాలు తోడ్పడతాయి. ముర్రుపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల సులువుగా జీర్ణమవ్వడంతో పాటు మల విసర్జన కూడా సులభంగా జరుగుతోంది. శిశువుకు దృష్టి లోపం రాకుండా నివారిస్తోంది. శిశువుకు కావాల్సిన ఉష్ణోగ్రతలలో తల్లిపాలు ఉంటాయి. తల్లిపాలు శిశువులకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ పౌష్టికాహారం. తల్లిపాలతోనే బిడ్డకు మలవిసర్జన సులభంగా అవుతుంది. తల్లిపాలు పట్టడం వలన బిడ్డకు-తల్లికి చక్కటి అనుబంధం ఏర్పడుతుంది. తల్లిపాల వలన పోషకాహార లోపాలు తగ్గి 13శాతం శిశు మరణాలు తగ్గించవచ్చని వైద్య పరిశోధనల్లో తేలింది. తల్లిపాలు తాగే శిశువుల్లో మేధాశక్తి కూడా పెరుగుతుందని పరిశోధనల్లో తేలింది.

తల్లికీ మంచిదే..

శిశువుకు తల్లి పాలివ్వడం వల్ల ఆరు నెలల్లోపు గర్భం దాల్చే అవకాశం ఉండదు. బిడ్డ కోరుకున్న ప్రతీసారి ఎంతసేపు తాగితే అంతసేపు పట్టించాలి. బిడ్డకు తల్లి స్తన్యమివ్వడం వలన రొమ్ము, గర్భసంచి, అండాశయం క్యాన్సర్‌లు వచ్చే అవకాశం తక్కువని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రసవ సమయంలో స్థిరత్వం కోల్పోయిన గర్భసంచి పూర్వస్థితికి వచ్చి రక్తస్రావం తగ్గుతుంది.

పాటించాల్సిన ఆహార నియమాలు

తల్లులు శిశువుకు స్తన్యమిచ్చే సమయంలో కెఫిన్ పుష్కలంగా ఉండే కాఫీలు, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం మంచిదికాదు. మసాలాలు చాలా తక్కువగా తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు తీసుకోవాలి. ద్రవాహారాన్ని పుష్కలంగా తీసుకోవాలి. బీన్స్, వేరుశనగ, అలసందలు, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని విటమిన్-సి ఇచ్చే పండ్లతో కలిపి తీసుకోవడం మంచిది. గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, బఠానీలు, నట్స్ వంటివి తీసుకోవాలి.

ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలు..

ప్రాజెక్టు	బాలింతలు	గర్భిణులు	6 నెలలు - 3 ఏళ్లు	3 - 6 ఏళ్లు
మండపేట	1,239	1,385	6,165	4,857
రాజోలు	995	1,212	5,260	5,934
పి.గన్నవరం	1,282	1,468	6,501	7,065
ముమ్మిడివరం	983	1,120	5,450	4,713
అమలాపురం	1,199	1,395	6,158	6,338
కొత్తపేట	1,396	1,631	6,973	7,447
రామచంద్రపురం	743	861	3,807	3,693

విశిష్టతను తెలియజేసేందుకే..



తల్లిపాల వారోత్సవాల విజయవంతానికి అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశాం. జిల్లాలో ఉన్న ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,726 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న బాలింతలు, గర్భిణీలకు తల్లిపాల విశిష్టతను తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్నాం.

– గుత్తుల సత్యవాణి, విమెన్ అండ్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ జిల్లా అధికారి, అమలాపురం

బిడ్డకు తొలి టీకా



ముర్రుపాలు బిడ్డకు తొలి టీకా వంటిది. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. తొందరగా జీర్ణమయ్యే గుణం తల్లిపాలలోనే ఉంటుంది. ఇటీవల కాలంలో తల్లుల్లో అవగాహన పెరుగుతోంది. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సంయుక్తంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

– దుర్గారావుదొర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, అమలాపురం

క్లుప్తంగా

శిక్షణను వినియోగించుకోవాలి

సామర్లకోట: ఎన్ఆర్‌జీఎస్ ఏపీఎంలు, ఏపీఓలు మూడురోజుల పాటు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జి.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరిసీతారామరాజు, తూర్పు, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదారి, ఏలూరు జిల్లాలోని ఏపీఎం, ఏపీఓల శిక్షణను సోమవారం స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సీజన్‌లో మొక్కలు ఎక్కువగా నాటే అవకాశం ఉంటుందని, ఉపాధి హామీ పథకంలో వీటి ప్రాధాన్యత ఎక్కువగా ఉండటం వలన ప్రజలకు పోషకాలు అందించే మొక్కలను ప్రతీ గ్రామంలోను నాటాలని సూచించారు. మునగ విత్తనాలను వేసుకోవడంపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. మునగ ఆకులోను, మునగకాడలోనే అనేక పోషకాలు ఉంటాయని చెప్పారు. విస్తరణ శిక్షణ కేంద్రంలో 50 మునగ మొక్కలతో తోటను పెంచుతున్నామని కోర్సు డైరెక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి తెలియజేశారు. ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణ మోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, కేఎస్ఆర్‌కే నిహారిక, వెంకటేశ్వరరావు, ప్రసాద్, ఆంజనేయులు శిక్షణ ఇచ్చారు.

భద్రాచలం సర్వీసుల పునరుద్ధరణ

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి భద్రాచలం బస్సు సర్వీసులను సోమవారం కుక్కునూరు మీదుగా పునరుద్ధరించినట్లు డీఎం షేక్ షబ్నం తెలిపారు. గోదావరి ఉధృతి నేపథ్యంలో కుక్కునూరు వద్ద రహదారి పైకి వరద నీరు వచ్చిందన్నారు. దీంతో రూటును మార్చి, పాల్వంచ మీదుగా భద్రాచలం బస్సులను ఇప్పటివరకూ తిప్పామన్నారు. భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గి, కుక్కునూరు మార్గంలో ముంపు నీరు తగ్గిందన్నారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రావడంతో యథావిధిగా ఈ మార్గంలో తొమ్మిది బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆమె తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ధవళేశ్వరం: గ్రామంలోని శేషగిరిరావుపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ధవళేశ్వరం పోలీసులు దాడి చేశారు. శిబిరం నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలతో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12,800, నాలుగు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలెక్కనున్న ప్రగతి

- అమృత్ భారత్ పథకంలో తుని, కాకినాడ, నిడదవోలు రైల్వేస్టేషన్ల ఎంపిక
- ప్రయాణికులకు అదనంగా సమకూరనున్న సదుపాయాలు

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో తొలి దశలో 11 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. అందులో తుని, కాకినాడ, నిడదవోలు స్టేషన్లు ఎంపికయ్యాయి. అదనపు ప్లాట్‌ఫాంలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు వంటి ఆధునిక సౌకర్యాలతో ఈ స్టేషన్లు ప్రయాణికులకు మరింతగా సేవలందించదానికి సిద్ధమవుతాయి.

తునికి ఏ గ్రేడ్

తుని : ఏజెన్సీకి ముఖద్వారం, నాలుగు నియోజకవర్గాల ప్రజలకు ప్రధాన రైల్వేస్టేషన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు నిత్యం రాజధాని, నగరాలకు రాక పోకలు సాగిస్తారు. బ్రిటిష్ కాలం నుంచి తుని రైల్వేస్టేషన్‌కు ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకంలో ఎంపిక చేసింది. దీంతో సుమారు రూ.20 కోట్ల వరకు నిధులు లభించనున్నాయి. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం కానుంది.

ఏ గ్రేడ్ స్టేషన్ : వివిధ ప్రాంతాలకు ప్రయాణించేవారి సంఖ్య, ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుని తుని రైల్వే స్టేషన్‌కు ఏ గ్రేడ్ పరిధి దక్కింది. ఇక్కడ 15 ఎక్స్‌ప్రెస్‌లు, ఐదు పాసింజర్ రైళ్లు ఆగుతున్నాయి. వీటిలో రోజుకు ఏడు వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. రోజుకు రూ.2.50 లక్షల ఆదాయం వస్తుంది. ఏడాదికి తుని స్టేషన్ నుంచి రూ.10 కోట్లు రైల్వేకు ఆదాయం సమకూరుతుంది. వివిధ ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య ఏటా పెరుగుతున్న నేపథ్యంలో ఎక్కువ రైళ్లకు హాల్ట్ కల్పించాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు పార్సిల్ విభాగానికి సంబంధించి ఎక్కువ సేపు రైళ్లు నిలపాలని ఎగుమతి, దిగుమతి దారులు కోరుతున్నారు.


తుని రైల్వేస్టేషన్ ప్రాంగణం

ప్రధాన సమస్యలు ఇవే

- ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని రెండవ ప్లాట్ ఫాంపై టికెట్ కౌంటర్ ఏర్పాటు ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. రిజర్వేషన్ ప్రయాణికులకు మాత్రమే వెయింటింగ్ రూం ఉంది. రెండో తరగతి ప్రయాణికుల కోసం అదనపు హాల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. రైల్వేస్టేషన్‌కు అవతల పది వార్డులకు చెందిన 25 వేల మంది జనాభా ఉన్నారు. వీరు మార్కెట్‌కు వచ్చేందుకు కొండవారిపేట వద్ద ఫుట్‌పాత్ వంతెన ఏర్పాటు చేయాలని చేసిన ప్రతిపాదనలకు మోక్షం లభించనుంది.

సమకూరనున్న వసతులు

- ప్రస్తుతం ఉన్న పాతభవనాలను తొలగించి క్లాక్ రూంలు, రిటైరింగ్ గదులు, ఎస్కలేటర్, 12 మీటర్ల వెడల్పుతో ఎండ్ టు ఎండ్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, విద్యుత్ వెలుగుల వ్యవస్థ ఆధునీకరణ, ప్రయాణికులు సులభంగా గుర్తించేలా రాకపోకలకు సంకేతాలు, వ్యర్థాల నిర్వహణ, స్టేషన్ ముఖద్వారం అభివృద్ధి తదితర పనులు చేపడతారు.



రెండో టికెట్ కౌంటర్ అవసరం



కోటనందూరు, నర్సీపట్నం, రౌతులపూడి తదితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా రెండో ప్లాట్‌ఫాంపై టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి. జనరల్ కేటగిరిలో ప్రయాణికులకు విశ్రాంతి హాలు, మరుగుదొడ్లు తదితర వసతులను కల్పించాలి.

– కుసుమంచి సుబ్బరాయులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, తుని



కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్

కాకినాడ టౌన్ స్టేషన్‌కు కొత్త హంగులు

కాకినాడ: దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక రవాణా ఆదాయాన్ని సమకూర్చే కాకినాడ రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. ఎన్నో ఏళ్లుగా ప్రయాణికులు ఎదురుచూస్తున్న అభివృద్ధి దిశగా అడుగులు పడనున్నాయి. కాకినాడ ప్రధాన రైలు మార్గంలో లేకపోయినా రేవు కార్యకలాపాలు, పారిశ్రామికాభివృద్ధి వల్ల ఎంతో విశిష్టతను సంపాదించింది. కాకినాడ నుంచి రోజూ 14 రైళ్ల రాకపోకలు సాగిస్తుండగా సుమారు నాలుగు వేలమంది ప్రయాణిస్తున్నారు. సరకు రవాణా ద్వారా ఏటా సుమారు రూ.400 కోట్ల ఆదాయం లభిస్తోంది. అయితే అభివృద్ధిని మాత్రం సాధించలేకపోయింది. రైల్వే స్టేషన్‌లో మెరుగైన సదుపాయాలు, వసతులు కల్పన కోసం ఎంపీ వంగా గీత, రైల్వే ప్రయాణికుల సంఘ సభ్యులు, అనేక సందర్భాలలో చేసిన విన్నపాలకు ఎట్టకేలకు ఫలితం లభించింది. దేశవ్యాప్తంగా కొన్ని రైల్వే స్టేషన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదించిన రైల్వే శాఖ అమృత్ భారత్ పథకంలో కాకినాడకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన రైల్వేస్టేషన్‌లలో స్టేషన్ ముఖద్వారాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం, విద్యుదీకరణ, స్టేషన్ ప్రాంగణం సుందరీకరణ, ప్లాట్ ఫారంల అభివృద్ధి, ఎస్కలేటర్లు, లిఫ్టులను అభివృద్ధికి ప్రతిపాదించారు. ఆయా స్టేషన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి, ప్రతిపాదనలపై ప్రయాణికులను కూడా భాగస్వామ్యం చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఆగస్టు మూడో తేదీ లోపుగా ప్రజలు ఇచ్చే సూచనలు, సలహాలను కూడా పరిగణలోకి తీసుకుని ఆకర్షణీయ స్టేషన్లను అభివృద్ధి చేయాలని రైల్వే శాఖ యోచిస్తోంది. ఇవన్నీ సకాలంలో అమలు జరిగితే కొద్ది రోజులలోనే కాకినాడ రైల్వే స్టేషన్ రూపు రేఖలు సమూలంగా మారిపోనున్నాయి. ప్రజలు ఆశించిన ఆధునిక హంగులు సమకూరబోతున్నాయి.

ప్లాట్‌ఫాంను విస్తరించాలి



భానుగుడి వైపు ఉన్న నాలుగో నెంబర్ ప్లాట్ ఫాం విస్తరించాలి. ప్రయాణికుల సౌకర్యార్థం రైలు నంబర్, బోగి నంబర్ తెలియజేసేలా డిజిటల్ బోర్డులు పెట్టాలి. ప్రయాణికులు వేచి ఉండేందుకు షెల్టర్లు ఏర్పాటు చేసి, లిఫ్ట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. కాకినాడ విశిష్టత తెలియచెప్పేలా ముఖద్వారం తీర్చిదిద్దాలి.

– వైదీ రామారావు, జెడ్ ఆర్‌యూసీసీ సభ్యులు, కొకనాడ ప్రయాణికుల సంఘ అధ్యక్షుడు

నిడదవోలులో మూడు ఎస్కలేటర్లు, రెండు లిఫ్టులు


నిడదవోలు రైల్వేస్టేషన్‌లో మూడవ ప్లాట్‌ఫాం

నిడదవోలు: నిడదవోలు స్టేషన్ ముందు భాగాన్ని ఆకర్షణీయంగా తీర్చదిద్దడానికి (ఎలివేషన్‌కు) అధికారులు మూడు నమూనాలను సిద్ధం చేశారు. ప్రయాణికులు, ప్రజలు, మేధావుల సూచనల ప్రకారం దీనిలో ఒకటి ఎంపిక చేయనున్నారు. నిడదవోలు రైల్వే స్టేషన్లో ప్రస్తుతం మూడు ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. ఈ ప్లాట్‌ఫామ్స్ ఫ్లోర్ మొత్తం 200 మీటర్ల మేర గ్రానైట్‌తో ఆధునీకరిస్తారు. నాలుగు, ఐదు ప్లాట్‌ఫాంలను నిర్మించనున్నారు. స్టేషన్లో మూడు ఎస్కలేటర్లు, రెండు లిఫ్టులను నిర్మించనున్నారు. ప్రస్తుతం స్టేషన్లో ఒకటి, రెండు, మూడు ప్లాట్‌ఫాంలను చేరడానికి ఒకే ఒక కాలినడక వంతెన ఉంది. రాజమహేంద్రవరం వైపు ఆక్సిజన్ పార్కు వద్ద 12 మీటర్ల వెడల్పుతో ఎండ్ టు ఎండ్ ఫుట్ పాత్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ప్రయాణికులు సులభంగా గుర్తించేలా రాకపోకలకు సంకేతాలు, పార్కింగ్ ప్రదేశాలకు మార్గాల ఏర్పాట్లు, వ్యర్థాల నిర్వహణ భవన నిర్వహణ పనులు చేపడతారు. రైల్వే జంక్షన్ కావడంతో వివిధ రైళ్లు ఇక్కడి నుంచి భీమవరం, నరసాపూర్, గుడివాడలకు మారతాయి. ప్రతిరోజు ఇక్కడి నుంచి 3,800 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రోజూ 1.50 లక్షల ఆదాయం చేకూరుతుంది. సుమారు 68 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి వంటి ఏజెన్సీ ప్రాంతాలతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల నుంచి ప్రయాణికులు ఎక్కడికైనా వెళ్లాలంటే నిడదవోలు స్టేషన్‌కు రావాల్సిందే. ఈ స్టేషన్ మీదుగా రోజుకి సుమారు 30 గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిడదవోలు గూడ్స్ క్యాబిన్ నుంచి ధాన్యం ఎక్కువ ఎగుమతి అవుతుంది. దీని ద్వారా నెలకు సుమారు రూ.కోటి ఆదాయం రైల్వే శాఖకు సమకూరుతోంది.

ప్రయాణికులకు సౌకర్యం



నేను విజయవాడలో విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాను. ప్రతీ రోజు నా డ్యూటీకి నిడదవోలు నుంచి వెళతాను. ఎక్స్‌లేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేస్తే వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు సులభంగా వెళ్లవచ్చు. ఒక్కోసారి నాకు ట్రైన్ మిస్ అవుతుంది. ఇతర ప్లాట్‌ఫామ్స్‌కి వెళ్లడానికి ఫుట్‌పాత్ బ్రిడ్జిపై నుంచి వెళుతున్నాం. అదే ఎక్స్‌లేటర్, లిఫ్టులు ఉంటే సమయానికి చేరుకోవచ్చును.

– అబ్దుల్ రెహమాన్ ఖాన్, ప్రయాణికుడు, నిడదవోలు

రయ్ అంది వాదం.. సై అంది క్రోధం

- అవినీతి ఆరోపణలతో రోడ్కెక్కిన నేతలు
- సవాలు..ప్రతి సవాళ్లతో వేడెక్కిన పెద్దాపురం
- వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులను అడ్డుకున్న పోలీసులు

సామర్లకోట: కొన్ని రోజులుగా పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకుంటున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వాటిని రుజువు చేస్తామంటూ సిద్ధపడడంతో సోమవారం పెద్దాపురంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పెద్దాపురంలోని వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయం నుంచి తన కార్యకర్తలతో దవులూరి దొరబాబు, టీడీపీ క్యాంప్ కార్యాలయం నుంచి రాజప్ప పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌కు వెళ్లడానికి సిద్ధం అయ్యారు. ముందుగానే విషయం తెలుసుకున్న పోలీసులు ఆయా క్యాంప్ కార్యాలయాల వద్ద మోహరించి ఇద్దరినీ అడ్డగించారు. దాంతో ఉద్రిక్తతకు తెర పడింది. ఇద్దరు నాయకులు వారి క్యాంప్‌ల కార్యాలయాల వద్ద విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి మాట్లాడారు.


రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును అడ్డుకున్న పోలీసులు


టీడీపీ శిబిరం వద్ద రాజప్ప తదితరులు

ఆ టెస్టుతో నిరూపణ సాధ్యం కాదు : రాజప్ప

దీనిపై రాజప్ప మాట్లాడుతూ లై డిటెక్టర్ టెస్టులతో ఆరోపణ నిరూపణ సాధ్యం కాదన్నారు. 2019 ఎన్నికల ముందు రామేశ్వరం మెట్టపై ఆరోపణలు వచ్చాయని, ఆరోపణలు నిజం అయితే పెద్దాపురంలో తనను ఓడిస్తారని చెప్పానని, అయితే తనను 2019లో గెలిపించడంతో రామేశ్వరం మెట్ట తవ్వకానికి తనకు సంబంధం లేదని ప్రజలు నమ్మారని రాజప్ప తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాల శ్రీను, రెండు మున్సిపాలిటీల కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. టీడీపీ శిబిరం వద్ద టీడీపీ నాయకులు జ్యోతుల నవీన్, రాజా సూరిబాబురాజు, పాలకుర్తి శ్రీనుబాబు, కంటే బాబు, అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్, ఢిల్లీలో లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధం కావాలి : దొరబాబు

నియోజకవర్గంలో అవినీతికి పాల్పడ్డారని రాజప్ప చేసిన ఆరోపణలకు దొరబాబు స్పందిస్తూ తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలని, దీనికి తాను లై డిటెక్టర్‌కు టెస్టుకు సిద్ధమని, నీవు సిద్ధమా అని రాజప్పకు సవాల్ చేశారు. రామేశ్వరం మెట్టను గుల్ల చేసింది ఎవరో చెప్పాలని దొరబాబు అన్నారు. తనపై ఆరోపణలు రుజువు చేస్తే కార్పొరేషన్ చైర్మన్, కోఆర్డినేటర్ పదవులకు రాజీనామా చేసి సామాన్య కార్యకర్తగా ఉంటానని, రాజప్పపై ఆరోపణలు రుజువు అయితే ఏమి చేస్తారో ప్రకటించాలని దొరబాబు ప్రశ్నించారు. లై డిటెక్టర్ టెస్టుకు బాండ్ పేపరుపై సంతకాలు చేయాలని, తాను తయారు చేయించిన బాండ్‌పై సంతకం చేయించడం ఇష్టం లేకపోతే రాజప్ప లాయర్‌తో సంప్రదించి సంతకం చేయించి ఇవ్వాలని అప్పుడే లై డిటెక్టరు టెస్టు టీము వస్తుందని తెలిపారు. పెద్దాపురంలో అయితే పోలీసులు అడ్డుకొంటున్నారని, హైదారాబాద్, ఢిల్లీలో ఒంటరిగా టెస్టుకు తాను సిద్ధమేనని, రాజప్ప కూడా సిద్ధం కాగలరా అని దొరబాబు సవాల్ చేశారు.

ఎర్రకోనేరు హత్యోదంతంలో నిందితుల అరెస్టు

- ఇది వరకే వారిపై 11 కేసులు
- జైలు నుంచి తప్పించుకొని వచ్చి మరో హత్య
- తొమ్మిది రోజుల్లోనే కేసును ఛేదించిన జిల్లా పోలీసులు

కాకినాడ క్రైం: ఎర్రకోనేరు హత్యోదంతంలో నిందితులు సునీల్ సాహు, రాజ్ బిందా సింగ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తొమ్మిది రోజుల్లోనే ఈ కేసును ఛేదించారు. 64 మంది సభ్యుల ఎనిమిది బృందాలు రేయనక పగలనక పడ్డ కష్టానికి ఫలితం దక్కింది. ఈ ఘాతుకంలో ఓ వృద్ధి చావుతప్పి బతికి బట్టకట్టగా మరో మహిళ కన్న కూతురు ముందే విచక్షణారహితమైన కత్తిపోట్లకు బలైపోయింది. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. గత నెల 16వ తేదీన అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం, గుంటపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దమ్ము దుర్గారావు కిరాయిలు ముగించుకొని స్వగ్రామానికి బయల్దేరాడు. ఇంతలో ఆటో రాజుల కొత్తూరు జాతీయ రహదారిపైకి వచ్చే సరికి రాత్రి 9.30 గంటల సమయంలో ఇద్దరు ఆటో ఆపారు. కిరాయి కోసమని భావించిన దుర్గారావు ఆటో ఆపే సరికి రాజ్ ఆటో డ్రైవర్ మెడను గట్టిగా పట్టుకోగా, సునీల్ సాహు విచక్షణారహితంగా వెనుక నుంచి వరుసగా కత్తితో పొడిచి దుర్గారావును జాతీయ రహదారికి అటువైపు పడేసి ఆటో ఎత్తుకెళ్లారు. కొంతదూరం వచ్చే సరికి ఎర్రకోనేరు గ్రామ పరిధిలో హైవేపై పాన్‌షాప్ నడుపుకుంటున్న పప్పు సత్యవతి ఇంట్లోకి చొరబడ్డారు. కత్తి చూపి బెదిరించి డబ్బు బంగారం కావాలని అడిగారు. తన వద్ద ఏమీ లేవని ఆ వృద్ధురాలు చెప్పడంతో కన్నకూతురు నాగమణి ఎదుటే కత్తితో పొడిచి చంపేశారు. నాగమణి మెడపై కూడా కత్తి పెట్టడంతో తన మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, సెల్‌ఫోన్ ఇచ్చి ప్రాణాలు నిలుపుకుంది. ఇదే తరహాలో ఈ ఘటనకు నెల రోజుల ముందు పిఠాపురం మార్గంలో మరో కేసు నమోదైంది. ఇందులో ఆటోలో ప్రయాణికుల్లా ఎక్కిన సునీల్ సాహు, అతడి స్నేహితుడు కైలాష్ బాగ్ డ్రైవర్‌కు ఇరువైపులా కూర్చొని కొంత దూరం వెళ్లేసరికి డ్రైవర్‌ను పొడిచి శివారులోని పొలాల్లో పడేశారు. ప్రయాణికులకు కత్తులు, తుపాకులు చూపి బంగారం, డబ్బు దోచుకున్నారు. ప్రయాణికుల ఫిర్యాదుతో పోలీసులు నిందితుడు కైలాష్‌బాగ్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనలో సునీల్ సాహు తప్పించుకున్నాడు. వరుస ఘటనలతో అలజడి సృష్టించిన హంతకులు జిల్లాతో పాటు విశాఖ జిల్లా పరిధిలో పలుచోట్ల తలదాచుకున్నారు.


పట్టుబడ్డ నిందితులతో తుని రూరల్ ఎస్ఐ విజయబాబు, బృందం


వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

విశాఖ శివారులో పట్టుబడ్డ నిందితులు

హత్య అనంతరం హంతకులిద్దరూ ఒరిస్సాలోని సంబల్‌పూర్‌కు పారిపోయి తలదాచుకున్నారు. వారి కదలికలపై నిఘా కొనసాగించిన పోలీసులకు జూలై 30వ తేదీన విశాఖ శివారులో పట్టుబడ్డారు. నిందితుల్లో ఏ1గా పరిగణిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సునీల్ సాహు ఓ హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తూ కోర్టుకు తరలిస్తున్న క్రమంలో బిలాస్‌పూర్ సెంట్రల్ జైలు నుంచి తప్పించుకున్నాడు. ఇతడిపై తొమ్మిది క్రిమినల్ కేసులు ఉన్నాయి. అక్కడి నుంచి ఒడిశా వెళ్లి అప్పటికే చిన్నాచితక దొంగతనాల్లో ఆరితేరిన సంబర్‌పూర్ జిల్లా బుర్లా గ్రామానికి చెందిన రాజ్ బిందా సింగ్‌తో పరిచయం పెంచుకున్నాడు. ఇతడిపైనా రెండు కేసులున్నాయి. కొన్నాళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు జీవనోపాధి పేరుతో వచ్చిన సునీల్‌సాహు వచ్చేటప్పుడు రాజ్‌ను కూడా తీసుకొచ్చాడు.

సొత్తు స్వాధీనం

హత్య, హత్యాయత్నం, దారిదోపిడీలపై తుని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జొన్నకూటి విజయబాబు తెలిపారు. నిందితుల నుంచి ఓ ఆటో, రెండు సెల్ ఫోన్లు, బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. నిందితులను గుర్తించడంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో బృందాలు విశేష కృషి చేశాయని చెప్పారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి సహా తుని రూరల్, జగ్గంపేట, ప్రత్తిపాడు సీఐలు, ఎస్ఐలు, సీసీఎస్ అధికారులు, ఐటీ కోర్ విభాగం అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

వరదలతో డిగ్రీ పరీక్షలు వాయిదా

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఆగస్టు ఒకటి నుంచి జరుగవలసిన డిగ్రీ నాలుగవ సెమిస్టర్ పరీక్షలను వరదల కారణంగా ఆగస్టు 8తేదీకి వాయిదా వేశామని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని అన్ని అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు పంపించామన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక గ్రామం మూలపోడుకు చెందిన గొల్లశేఖర్(59) ప్రమాదవశాత్తూ పంటకాలువలో పడి మృతిచెందారు. ప్రతి రోజూ సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం వంతెన వద్ద స్నేహితులతో కలిసి కూర్చొని వచ్చే శేఖర్ ఆదివారం రాత్రి కూడా అక్కడికి వెళ్లారు. శేఖర్ రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఉదయం కాలువలో మృతదేహం లభ్యమైంది. చీకటి పడిన తరువాత కాలువలో దిగి కాళ్లు కడుక్కునే ప్రయత్నంలో పడిపోయారని, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో గమనించలేదని భావిస్తున్నారు. పోలీసులు పోస్ట్‌మార్టంకు రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

మలికిపురం: మండలంలోని బట్టేలంక గ్రామంలో ఆశ్రమం వద్ద ఉల్లూరి బాలరాజు(42) మృతి చెందారు. రామరాజులంక గ్రామానికి చెందిన బాలరాజు బట్టేలంక గ్రామంలో అత్తవారి ఇంటి వద్ద నివాసం ఉంటున్నాడు. బాలరాజు ముందు భార్యతో విడిపోవడంతో బట్టేలంకకు చెందిన మరొక మహిళతో వివాహం అయింది. కాగా భార్యాభర్తల గొడవల కారణంగా ఆదివారం రాత్రి ఉరి పోసుకుని చనిపోయినట్లు బట్టేలంకలోని అత్తవారి ఇంటి నుంచి రామరాజులంక గ్రామంలోని బాలరాజు బంధువులకు సమాచారం వెళ్లింది. సోమవారం ఉదయం బట్టేలంక వచ్చిన బాలరాజు కుమార్తె సుమ, బంధువులు బాలరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్రమంలో ఘర్షణ జరిగింది. దీంతో సుమ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్ట్‌మార్టం కోసం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోక్సో కేసులో అరెస్ట్

కాట్రేనికోన: బాలికను ప్రలోభపెట్టి ఇంటి నుంచి తీసుకుని వెళ్లిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మండలంలోని ఉప్పూడికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన చింతా పవన్‌కుమార్ మాయమాటలతో ఇంట్లో నుంచి తీసుకువెళ్లిపోయాడు. బాలిక తల్లి కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఐదు గంటల్లో బాలిక ఆచూకీ గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి పవన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. అతను వినియోగించిన బైక్‌ను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని మమ్మిడివరం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.